ఆంధ్రసాహిత్యపరిషల్లిఖితపుస్తక సంచయము

# అరవదేశమునందలి యాంధ్రవాఙ్మయము.

పరిషత్పుస్తకాలయమునకరవదేశమునందలి లిఖితపుస్తకములు సుమారు 400 లు సంపాదింపఁ బడినవి. ఈపుస్తకములను గుఱించి వాఙ్మయపరిశోధకులు తెలిసికొనఁదగిన యంశములు కొన్ని గలవు.

ఈ గ్రంథములలో నరవదేశనివాసులు రచించిన వనేకములున్నవి. వీనినిఁ బరిషత్పుస్తకాలయమున కొసఁగిన వారిలోఁ దెలుఁగు వ్రాయుటకుఁ గాని చదువుటకుఁ గాని సమర్థులుకానివారు పెక్కురు గలరు. తెలుఁగాదేశమున రాజాదరముకల భాషగానుండిన దినములలో గ్రంథకర్తలు బయలుదేఱి గ్రంథముల రచియించియుండిరి. వారాంధ్రదేశమునుండి పోయియచ్చట స్థిరపడినవారుగాఁ గానివారిసంతతివారుగాఁ గాని యుండవలయును. కేవలమరవవారు వ్రాసినగ్రంథములుగూడఁ గొన్ని యీ సంచయమునందున్నవి. దక్షిణదేశమునందుఁ దెలుఁగునకుఁ బ్రభుపోషణమున్న సమయమున నాంధ్రులనేకు లాప్రాంతములకుఁ బోయిరనుట వాస్తవము. ఇప్పటికిని వారిసంతతి వారచ్చటనున్నారు. పరిషత్తు సంపాదించిన దక్షిణదేశగ్రంథ సంచయమునందుఁ గొన్ని

## సంస్కృతగ్రంథములు

కూడ నున్నవి. కాని తెలుఁగు పుస్తకముల సంఖ్యకంటె వీనిసంఖ్య మిక్కిలి తక్కువ. ఈసంస్కృత గ్రంథములలోఁ గొన్ని యరుదైనవి యున్నవి; కొన్ని యాధునికదాక్షిణాత్యపండిత విరచితములున్నవి. మంకిభట్టకృతమైన ప్రాతిశాఖ్యభాష్యమును (భరద్వాజశిక్ష), కేశవమిశ్రుని తర్కభాషయుఁ గాంచీనాథుని రతిరహస్య దీపికయు, శంకరుని శారీరమీమాంసాభాష్యమును, దిరు

లదేవరాయల గీతగోవింద వ్యాఖ్యానమును వీనిలో ముఖ్యములైనవిగా నున్నవి. తర్కగ్రంథమగు గదాధరవిరచితసామాన్యనిరుక్తి నునుపైన మొద్దుకాగితములపై వ్రాయఁబడి యున్నది. పాలకాప్యమునికృత వనానుచరేతిధ్యాయ మని యొక శాస్త్ర మున్నది. దానిలో గజరోగచికిత్సా వృంత్తాంతము ముని చక్కఁగ వివరించినాఁడు. మఱికొన్ని వైద్య సంగీత శ్రౌత గ్రంథములుకూడ నున్నవి. ఇవి యన్ని తెలుఁగులిపియందే యున్నవి.

భరతముని విరచితమైన యభినయదర్పణమును, శార్ఙ్గసూరి ప్రణీతంబైన సంగీతరత్నాకరమును గలవు. తక్కినవి

# తెలుఁగు గ్రంథములు.

నన్నయ మొదలు పెద్దనాదులవఱకును గల కవుల గ్రంథములలో మిక్కిలి ప్రఖ్యాతిచెందినవే యిందున్నవి. అనఁగా భారతము, రామాయణము, భాగవతము, మనుచరిత్ర, వసుచరిత్ర, రాఘవపాండవీయము, హరిశ్చంద్రనలోపాఖ్యానము, నరసభూపాలీయము మొదలగునవి యున్నవి కాని హెచ్చుకీర్తి గడింపని ప్రబంధములు పూర్వకాలపువి యంతగా లేవు. ఆంధ్రదేశమున నంత సుప్రసిద్ధుఁడైన శ్రీనాథుని గ్రంథమొక్కటియైన సంచయమునఁ గాన రాకుండుట చిత్రముగ నున్నది. మొత్తముమీఁద మధ్యకవుల కావ్యములు నాధునికులకావ్యములును సంచయమునందు హెచ్చుగానున్నవి. ఆప్రాంతములం దాంధ్రభాష కర్ణాట రాజులరాజ్యకాలమున వ్యాపించినది. కావున నంతకుఁ బూర్వపు వాఙ్మయముకంటెఁ దరువాతి వాఙ్మయమే యచ్చట నధికముగా నున్నది. మఱియు విజయనగరరాజులనాఁటి వాఙ్మయమే దక్షిణదేశమున 18 వశతాబ్దియందు బయలుదేఱిన వాఙ్మయమునకు మాతృకగా నున్నది. సంచయమునందలి యా తెలుఁగు గ్రంథములను, బురాణములు, నిఘంటువులు, వ్యాకరణము, ఛందస్సు, అలంకారశాస్త్రము, కళలు, పద్యకావ్యములు, శతకములు, దండకములు, యక్షగానములు, ద్విపదకావ్యములు, వచనకావ్యములు నని విభజించి యొక్కొకశీర్షిక క్రింద వాని వానిని గుఱించి క్లుప్తముగఁ జెప్పెదను.

# పురాణములు.

నన్నయభట్టపోతనభాస్కరవిరచిత భారత, భాగవత, రామాయణము లును క్రొత్తవి కొన్నియు నీసంచయమున నున్నవి. రామాయణము సంస్కృతమున మహాకావ్యముగాఁ బరిగణింపఁబడుచున్నను సౌలభ్యముకొఱకుఁ బురాణములక్రిందఁ జేర్చితిని. విష్ణుపురాణాదులు, వచనకావ్యములు, కొన్ని యున్నవిగాని వానినిగూర్చి ప్రబంధములక్రిందఁ జెప్పెదను. పోతనరచించినదిగాక, హరికభట్టారక కృతంబైన భాగవత మొండున్నది. ఇది పద్యకావ్యము. ఏకాదశ ద్వాదశ స్కంధములు మాత్ర మున్నవి. హరికభట్టారకుఁడు హనుమద్భక్తుఁడు. గ్రంథమును హనుమంతునికే యంకితము చేసెను. ఈతఁడు సహజసారస్వత చంద్ర నామాంకుఁడు. గ్రంథాదియందలి

“శా॥ బంధూక ప్రసవాతిరిక్త వదనుం బ్రఖ్యాతునిం రామహృ
ద్బంధుం వాయుతనూభవుం దలఁచి విద్వత్కోటి, మద్వాగ్విభూ
తిం ధాత్రి న్వినుతింప భాగవతముం దేకాదశ ద్వాదశ
స్కంధంబుల్ దెనిఁగింతుఁ బూర్వకథితస్కంధాను పూర్వంబుగన్

అనుపద్యమువలన నీతఁడు భాగవతమును బూర్తిగఁ దెలిఁగించెనేమోయను సందియము కలుగుచున్నది గాని గ్రంథమును జదువ నాసందియము తొలఁగుటకుఁ గారణములు కాన్పించుచున్నవి. వెలిగందలనారయ పూరించిన యేకాదశ ద్వాదశ స్కంధములలోని పద్యములవంటి పద్యములిందుఁ గన్పట్టుచున్నవి. మాదిరికొక్కటి చూపెదను.

గీ॥ భక్తులగు యాదవేంద్రులఁ బరఁగఁజూచి
యన్యపరిభవ మెఱుఁగరీ యదువులనుచు
వీరిఁ బరిమార్ప నేఁ దక్క వేఱొకండు
దైవమింక లేదు త్రిభువనాంతరము లందు. వెలిగందల నారయ్య.

గీ॥ మత్సమర్పిత భక్తిచే మలయుఁ గాన
నన్యపరిభవ మెఱుఁగ దీయదుబలంబు
వీరిఁ బరిమార్ప నేఁ దక్క వేఱె మఱొక
దైవమోపునె త్రిభువనాంతరము లందు. హరికభట్టారకుఁడు.

హారిక భట్టారకునిఁజూచి వెలిగందల నారయ్యయో నారయ్యను జూచి భట్టారకుఁడో లేక వీరిద్దఱును మఱియొక దానినిఁ జూచియో వ్రాసియుండవలెను. మఱియు హారికభట్టారకుని

"క॥ మారుతసుతుండు కృతిపతి
పారీణత భాగవతము పలికెడి దఁట యీ
సారస్యమిచటఁ గలుగఁగ
వేఱొకమార్గమునఁ బోవు వెఱ్ఱియుఁ గలఁడే."

అను పద్యము

"క॥ పలికెడిది భాగవతమఁట
పలికించెడు వాఁడు రామభద్రుండఁట నేఁ
బలికిన భవహరమగునఁట
పలికెద వేఱొండుగాథ పలుకఁగ నేలా?"

అను పోతనపద్యమును జ్ఞప్తికిఁ దెచ్చుచున్నది. ఇంతియకాక హారికభట్టారకుని

"క॥ తిట్టుదురు దొంగదొంగని
కొట్టుదురా విప్రవరునిఁ గొమ్మనిచేతం
బెట్టుదురు భిక్షమనుచును
బట్టెడు గోమయము తెచ్చి పకపకనగుచున్."

మొదలగు పద్యములవలనను నితని శైలి భాగవతశైలి కనుకరణమని గ్రహింపవచ్చును. వీని నన్నిటినిఁ బట్టి చూడ నితఁడు వెలిగందలనారయ గ్రంథమునుఁజూచి వ్రాసెననియే చెప్పఁదగును. ఇతని యాశ్వాసాంత గద్యము,

"ఇది శ్రీహనుమల్లబ్ధవరప్రసాద సకల విద్యానవద్య సహజసారస్వత చంద్రనామాంక రామవిద్వన్మణి కుమార హారికభట్టారక ప్రణీతంబైన భాగవతమహాపురాణంబునందు.........పరిపూర్ణంబైన యేకాదశస్కంధము"...
అని యున్నది. ఇతఁడు పోతనకుఁ బిమ్మటివాఁడనుట స్పష్టమేగాని యితనికాల మిది యని నిశ్చయించుట కాధారము లిందు లేవు.

యథావాల్మీకంబను రామాయణ మీసంచయములోనున్నది. ఇది సమగ్రముగా లేదు. దీనిని ఘనగిరిరామకవి రచించెను. సంస్కృతమున నున్న ప్రకారము సర్గసర్గములుగ నితఁడు తెనిఁగించినాఁడు. ఈతఁడు దీనికి యథా

వాల్మీకంబని పేరిడినందున నిదివఱకొక యయథావాల్మీకముండి యుండవలె నని తోఁచెడిని. రంగనాథ భాస్కర రామాయణములే ఘనగిరి రామకవి యొక్క యయథావాల్మీకములై యుండును. కావున నీ రామకవి భాస్కరునికిఁ బిమ్మట వాఁడేయని తలఁచుచున్నాను. సంపుటములోని పత్రములు చాలమట్టునకుఁ జినిఁగియుండుటచేతను, గ్రంథాదిపత్రములు పోయినవి కావునను నితని కాలము సరిగాఁ గనుఁగొనుటకు వీలుకలుగకయున్నది.

మఱియు ప్రాఁతకోట పుల్లయ్య కృతమైన బ్రహ్మోత్తరఖండమును, రేవూరియనంతయజ్వరచితములైన శ్రీముష్ణమాహాత్మ్య - శివరహస్యఖండములును, నుదురుపాటి వేంకనార్యుఁడు విరచించిన మల్లపురాణము నున్నవి. ఈకవులు మువ్వురును దాక్షిణాత్యులు; ఆధునికులును. వీరిలోని నుదురుపాటి వెంకనార్యుఁడే యాంధ్రభాషార్ణవము రచించెను. ఇతఁడు 1767 మొదలు 1789 వ సంవత్సరము వఱకును రాజ్యముచేసిన రాయరఘునాథ తొండమాన్ మహీపాలుని యాస్థానకవి. తొండమానుని కాలమున రచింపఁబడిన గ్రంథము లీసంచయమునఁ జాలగలవు.

## నిఘంటువులు.

దేసితెనుఁగు మఱుఁగులు, నానార్థసారము, రేఫ ఱకార నిర్ణయము, ఆంధ్రనిఘంటువు, అకారాదియగు దేసితెలుఁగుల నిఘంటువు నను నిఘంటువు లిందున్నవి. వీనిలో నాంధ్రనిఘంటువు (వేంకటేశాంధ్రము) గణపవరపు వేంకటకవిరచితము. దేసితెలుఁగు నిఘంటువు సర్వలక్షణ శిరోమణిలోఁ జేరియున్నది. సర్వలక్షణ శిరోమణియు వేంకటపతి విరచితమే. ఆంధ్రనామసంగ్రహ సాంబ నిఘంటువులుకూడ నున్నవి. నంజుండ నిఘంటువని యొక సంస్కృత నిఘంటువుగలదు. దీనిని రచించిన యతఁడాధునికుఁడు.

## వ్యాకరణము.

కేతనకవి యాంధ్రభాషాభూషణము, లక్ష్మీనృసింహకవి యాంధ్రకౌముది, గణపవరపు వేంకటకవిసర్వలక్షణ శిరోమణియు నిందుఁ గలవు. లక్ష్మీనృ

సింహకవియొక్క యాంధ్రకౌముదిలోని సూత్రములకు నన్నయభట్టీయము-
లోని సూత్రములకును భేదము హెచ్చుగాలేదు. ఆంధ్రశబ్దచింతామణిని దీనిని
బోల్చి చూడఁగా సూత్రములకుఁ బ్రతిసూత్రములు కల్పింపఁబడినట్లు తోఁచు
చున్నది.

1 నామ్నః ప్రాతిపదికం.

2 ప్రత్యయోవర్ణకః.

3 ధాతుః క్రియా.

4 ద్రుతాఖ్యోనః.

అను సూత్రములు కొంచెము హెచ్చుతక్కువగా రెండిటికి సమము. ఇట్టి
వనేకములుకలవు.

1 నిత్యముంశోఽచి.

2 వాఽతః.

3 అనాదిషు విభక్త్యతః. సంధి. ఆంధ్ర కౌముది.

1 సంధిర్నాచోచ్యనుతః.

2 వాఽతః.

3 అనాదిషు విభక్తిషూతోఽవా. సంధి. ఆంధ్ర. చింతామణి.

ఈప్రతిసూత్రీద్వయమునుబట్టియే రెండుగ్రంథములకును గల సంబంధము
తెలిసికొనవచ్చును. ఆయనగ్రంథము నీయనయో యీయనగ్రంథము నాయన
యో లేక యిద్దఱును మఱియొకగ్రంథమునో చూచి యుండవలయు ననుట నిర్వి
వాదమైనయంశము. లక్ష్మీనృసింహకవి,

శ్లో. ఆథర్వణానికాణ్వాని బార్హస్పత్యాని సంవిదన్
కౌముదీమాంధ్రశబ్దానాం సూత్రాణిచకరోమ్యహం.

అని గ్రంథాదియందుఁ జెప్పియున్నాఁడు. కనుక నీతఁ డథర్వణాచార్యు
లకుఁ దరువాతివాఁడనుటస్పష్టము. ఇతఁడు నన్నయభట్టునుగాని నన్నయభట్టీ
యమునుగాని దడవియుండలేదు. ద్వితీయాచార్యుఁడైన యథర్వణుని నుదాహ
రించినప్పుడు ప్రథమాచార్యుఁడైన నన్నయనేల మానును? కనుక లక్ష్మీనృసిం
హకవికాలమునాఁటి కాంధ్రశబ్దచింతామణి పుట్టలేదేమో. ఆంధ్రకౌముదినిఁ
జూచి యెవ్వరో చింతామణివ్రాసి నన్నయపేరిడియుండును. నన్నయభట్టీయ

మును జూచియే నృసింహ మాంధ్రకౌముదిని రచించి దొంగతనము బయల్పడ కుండ జి ంతామణిని గప్పిపెట్టెనని యేలచెప్పరాదు? అనికొందఱు శంకింప వచ్చును? లక్ష్మీనృసింహకవి గప్పిపెట్టినచో నధర్వణుఁడైన నేల నన్నయను బే రొ్కనియుండఁడు? ముందువా రుదాహరింపకుంటయే వెనుకటివారు లేరనుటను దెలుపునుతర్కమన్ని చోటుల వర్తింపదుగాని సందర్భములనుబట్టి చూడనిమ్మోడ వర్తించునని నిస్సంశయముగఁ జెప్పవచ్చును. సంచయములోని పుస్తకము లనుబట్టిచూడ ఆంధ్రశబ్దచింతామణికిఁ దెలుఁగైన యప్పకవీయముగాని, వ్యా ఖ్యానమైన యహోబలపండితీయముగాని యచ్చట వాడుకలో నుండి నట్లు కాన్పింపదు. ఆంధ్రశబ్దచింతామణి దక్షిణదేశ మందుఁ బ్రచారములో లేకపోవుటయే యచ్చటఁ దెలుఁగు వర్ధమానదశయం దుండినకాలమునఁ జింతామణి పుట్టియుండలేదనుటకు నిదర్శనముగాఁ జెప్పవచ్చు ననితలఁచెదను. దక్షిణదేశమునందలి తెలుఁగు గ్రంథములన్ని సంపూర్ణముగ సంపాదింపఁబడి నప్పుడీ విషయమును గూర్చి యెక్కువ దృఢముగా సిద్ధాంతము చేయవచ్చును.

ఆంధ్రకౌముదీ కర్తయగు లక్ష్మీనృసింహము కాలమునాఁటికిఁ గణ్వ రచితమును, బృహస్పతిరచితమునైన తెలుఁగువ్యాకరణము లుండెనఁట. వీని పేరులే యిప్పుడరుదుగ వినుచున్నాము. ఈవ్యాకరణములు దొరకినచో భాషా తత్వపరిశోధకులకమూల్యసాధనములుగానుండును. లక్ష్మీనృసింహకవి మంద్ర వంశజుఁడు; వరదసోమయాజికిని నాంచారమాంబకును దనయుఁడు. అష్టభాషా పండితుఁడు. సర్వలక్షణశిరోమణి నాధునికుఁడైన గణపవరపు వేంకటకవి రచిం చెను. దీనియందుఁ బెక్కంశములుకలవు. "పలనాటిగొల్లలపాటజాతి" యని పాడినవేంకటకవియే యితఁడు. "కర్ణాటకవులలోమేటి" యని యితఁడు తనను గూర్చి లక్షణశిరోమణిలోఁ జెప్పికొనెను.

# ఛందస్సు.

కవిజనాశ్రయముయొక్క 7 ప్రతులీ సంచయమునఁగలవు. కవిజనాశ్ర యమునకే భీమచ్ఛందస్సని నామాంతరముకలదు. భీమకవి విరచిత జ్యోతిష పద్యములు 237 గల చిన్నపుస్తక మొకటియున్నది. వేములవాడ భీమకవి జ్యోతి

వపటలములు వ్రాసెననియు నవి యిప్పుడు కానవచ్చుచుండలేదనియు, వాడు కగలదు. భీమకవి జోస్యమని యొక గ్రంథ మచ్చుపడియున్నదది దానిప్రతు లిప్పుడు కన్పట్టవు. ఆ భీమకవియే యీభీమకవియై యాపద్యములే యీపద్యములై యుండినయుండవచ్చును. గ్రహములీ యీ స్థానములందుండినచో మను జుండిట్టివాడగునని యీపద్యములలో నున్నది. భీమకవిరచిత జ్యోతిషపద్యముల నుండి యొకపద్యము నుదాహరించెదను.

క. చదువులయందును జాణయు
వదలక లేఖలను వ్రాయవలసినవాడౌ
నదితీరవాస పరుడగు
సుదతులకును శిక్షచేయు సుజ్ఞానియునౌ.

మఱియు

క. నృపులకుఁ బ్రియుఁడై యుండును

అని ప్రారంభించి

శివవిష్ణులయందు భక్తిచేసెడివాఁడౌ

అని పవలకుఁ బ్రాసమైత్రి కల్పించినాఁడు. పూర్వలాక్షణికుల మతంబున "ప, వ" లకును "ప,బ" లకును బ్రాసమైత్రి యున్నట్లే యనుమానింపఁదగును. లక్ష్యములు కానవచ్చుచున్నవి. వెల్లంకితాతంభట్టు,

క॥ వబయోరభేదమనియెడు
నెపమున పఫ బభలు వాకునేర్పున వడిగా
నుపమింపవచ్చుఁ గృతులం
దుపనిషదుచితార్థ సూక్తులొలసినచోటన్

అనుపద్యమున "ప,బ"లకుఁ బ్రాసమైత్రిచూపినాఁడు. నాల్గుపాదములలో నొక పాదమునమాత్రమిట్లు రావచ్చునని కొందఱు తలంతురు. ఈప్రాంతముల నిప్పుడు సులక్షణసారముంబోలె దక్షిణదేశమునం దాకాలమునఁ గవిజనాశ్రయ ముపయోగపడినట్లు తోఁచుచున్నది. వీరనఛందస్సని యొక్క గ్రంథమున్నది. ఈవీరన్న భీమన్నను దడవినాఁడు గనుక భీమన్నకుఁ దరువాతివాఁడని నిశ్చ యింపవలసి యున్నది. ఆనందరంగరాట్ఛందపుఁ బ్రతులు 5, 6 కలవు. దీనిని రచించిన కస్తూరిరంగకవి యాధునికుండు. అనంతుని ఛందస్సుకూడ నున్నది.

తాతంభట్టుకవిలోకచింతామణి కలదు. దానిలో వర్ణనీయ వళిప్రాసదోషాధికారంబులున్నవి. గ్రంథముపూర్తిగ లేదు. తాతంభట్టు కవిలోక చింతామణికిఁగావ్యానుశాసనంబని పేరు పెట్టియున్నాఁడు. ఇప్పుడచ్చుపడియున్న సులక్షణసారము యొక్క యట్టపైఁ దద్గ్రంథకర్త తాతంభట్టని ముద్రించియున్నారు. ఈ యచ్చుపడ్డ సులక్షణసారమునకుఁ దాతంభట్టు కర్త కాఁడు. కవిలోక చింతామణియే యీ సులక్షణసారంబని భావించుట తప్పు. దీనికంటెఁ జింతామణి విలక్షణమైనది. లింగముగుంటతిమ్మయసులక్షణసారమునకు దీనికిని భేదములు కాన్పించుచున్నవి.

## అలంకార గ్రంథములు.

అజ్ఞాతకర్తృకంబయిన సాహిత్యలక్షణంబును, నారాయణయ్యం గారు తెలిఁగించిన యాంధ్రరసమంజరియుఁ దప్ప నలంకారగ్రంథములలో నూతనములీ సంచయమున లేవు.

ధనుర్విద్యావిలాసము, ఖడ్గలక్షణమునని రెండుగ్రంథము లీశీర్షికక్రింద రాఁదగినవి యున్నవి. ధనుర్విద్యావిలాసమును గొండవీటిరాజగు కృష్ణాని తిరుపతిరాయనింగారి ప్రోత్సాహంబున రచించి గ్రంథకర్తయగు కృష్ణమాచార్యుఁడు కోదండరామస్వామి కంకితంబు చేసెను. తిరుపతిరాయలు వెలమ; కుతుపశాహివలనఁ గొండవీటిరాజ్యమును బొందిన కృష్ణానిమాణిక్యరావు వంశస్థుఁడు. తిరుపతిరాజుతండ్రి యౌరంగజేబు కాలములోనివాఁడని గ్రంథమువలనఁ దెలియుచున్నది కావున నిది 17 వ శతాబ్ద్యంతముననో 18 వ శతాబ్ద్యాదినో పుట్టియుండును. ధనుర్విద్యావిలాసములో గ్రంథకర్త కొండవీటినిట్లు వర్ణించియున్నాఁడు:—

సీ॥ పసమించుభీష్మక ప్రముఖావనీపాలకులకు వజ్రపుజోడు కొండవీడు
శత్రురాజాధిరాజ విరాజదైశ్వర్య కులకంబుముకుఁ ద్రాఁడు కొండవీడు
అఖిలయాచకరాజహంస యూధములకుఁ గ్రొందామరలనాడు కొండవీడు
దేవతాయతనమై దీపించుకల్యాణ కుధరంబునైదోఁడు కొండవీడు

హరిహరవిరించి ముఖదేవతా వతంస
సంసదభిరామ హేమవిశాల సాల
జాగ్రదగ్రముహుర్ము హుశ్చటులపటహ
ఘుమఘుమధ్వానములఁగూడు కొండవీడు.

ఈగ్రంథ మమూల్యమైనదిగాఁ గన్పట్టుచున్నది. ఇది సంస్కృతమున కాంధ్రీకరణముకాదు. తిరుపతిరాజు తా నభ్యసించిన విధంబుల నుపన్యసింపఁగ గ్రంథకర్త విని యాప్రకారము పద్యములలో వ్రాసెను. అట్లయ్యు గ్రంథమంత ద్రోణుఁడర్జునునకుఁ జెప్పినట్లు సూతుఁడు శౌనకాది మహర్షులకుఁ జెప్పిన విధమున వైశంపాయనుఁడు జనమేజయునితోఁ జెప్పెనని కృష్ణమాచార్యుఁడు కోదండరామస్వామిని సంబోధించి వచించినభంగి నున్నది. ఇట్లు చెప్పుట మన వారి కాచారము. ఈయాచారము ననుసరించియే కాఁబోలును మొన్న మొన్న జరిగిన బొబ్బిలియుద్ధ వృత్తాంతముకూడ నారదుఁ డింద్రునకుఁ జెప్పవలసివచ్చి నది కాని దిట్టకవినారాయణ చెప్పుచుండఁగా మనము విననోఁచినవారము కాక పోయితిమి. చారిత్రక విషయములను నిటీవలిరాజుల కాలములోఁ గట్టఁబడిన దేవాలయంబులంగూర్చిన యంశంబులను సూతునివక్త్రబిలంబే వినిపించినది; శౌనకాది మహర్షుల శ్రవణకుహరంబులే యాలించినవి; నైమిశారణ్యమహీరుహంబుల ముదిగొమ్మలే తలలూఁచినవి. సూతునికిఁకనైన విశ్రాంతి యీయని వారు కృతఘ్నులుగదా.

ధనుర్విద్యావిలాసమంతయు స్వానుభవముచేఁ దిరుపతిరాజు వివరించినది గనుక మిక్కిలి విలువగలగ్రంథముగా మనమెన్నఁదగి యున్నది. దీనిలో విషయంబులను గ్ణప్తముగాఁ గృష్ణమాచార్యుఁడే యిట్లు చెప్పినాఁడు.

“ఈ ధనుశ్శాస్త్రంబునం గురుసంకీర్తనంబును, శిష్యావరణంబును, విద్యాప్రభావ సూచనంబును, సఖండాఖండకోదండద్వయ నామోద్దేశంబును, ధనుర్నిర్మాణ ప్రమాణప్రముఖ విశేషవిభాగంబును, మార్గణపరిగణనా ప్రీణనంబును, దద్విధానమాన ప్రశంసనంబును, పుంఖోపసంఖ్యానంబును, పక్షపరిమాణ ప్రశంసయు, నిషంగరచనా ప్రవచనంబును, మౌర్వీవిధాన కథనంబును, నంగుళిత్రాణ ప్రకీర్తనంబును, జ్యారోపణ ప్రకరణంబును, ధనురూర్ధ్వాధర భాగ విభాగంబును, ముష్టిప్రకరణంబును, స్థానోపసంఖ్యానంబును, శరగ్రహణ హస్త ప్రతిపాదనంబును, సంధానక్రమ వివరణంబును, ఆకర్షణహస్తప్రస్తావం

బును, బాణహస్తక్షేత్ర నిరూపణంబును, దృష్టిలక్షణాన్వేక్షణంబును, ధనురాకర్షణకౌశలోపన్యాసంబును, శరవ్యాపార యోగ్యతిథివార తారకాకరణ విస్తృతప్రస్తావంబును, ఖురళికారంగ ప్రసంగంబును, రంగప్రవేశ లక్షణనిర్దేశంబును, ధనుశ్శరపూజా యోజనంబును, గురుప్రణామస్థేమంబును, శరశరాసన గ్రహణ పౌర్వాపర్య పర్యాలోచన సూచనంబును, లక్ష్యశుద్ధి లాభంబును, లక్ష్యవేదికారచనా వివేచనంబును, నారాచమోచనప్రకార సూచనంబును, చిత్రలక్ష్యభేదనోపాయ ప్రతిపాదనంబును, శాబ్దలక్ష్యశరాభ్యాస విలాసంబును, దూరనికటస్థలలక్షితలక్ష్యభేదన దృష్టి ముష్ట్యంగుళనియమన లక్షణాన్వేక్షణంబును, రథారోహణ శరాభ్యాస విశేషభాషణంబును, గజారోహణ శరప్రయోగ విధానంబును, హయారోహణ శరమోక్షణ వివరణంబును, దూరాపాతి శరాభ్యాస విస్తరప్రకీర్తనంబును, శరప్రయోగ సమయాసమయ నిరూపణంబును, శరగమనగుణదోషవినిభాగంబును, దివ్యాస్త్రమంత్ర తంత్రప్రయోగ విస్తరప్రస్తావంబును లోనుగాఁ బంచచత్వారింశల్లక్షణంబులు ఘటితంబులై యుండు. "

గ్రంథమునందు మొదట వెలమవారి చరిత్రమించుక గలదు. ఇట్లు వ్రాయఁబడిన గ్రంథములు తెలుఁగు బాసలో మిక్కిలి యరుదు. ఈగ్రంథము గణింపఁదగినదని నాయభిప్రాయము.

ఖడ్గలక్షణమను రెండవగ్రంథము నెవ్వరు రచించిరో తెలియదు. దీనిలో నాలుగు పత్రములుమాత్రమే యున్నవి. కత్తులపేరులు, వాని పొడవువెడల్పులు నీగ్రంథములోఁ జెప్పఁబడినవి.

## పద్యప్రబంధములు.

సంచయమునందలి పద్యకావ్యముల కర్తలగు 47 గురుకవులలో 27గుర రవదేశపువారుగా నున్నారు. వీరు 18 వ శతాబ్దియందుండినవారు. అచ్చటచ్చటఁ జ్యుతసంస్కారంబును శృంగారాతిరేకంబును వీరి పద్యప్రబంధముల విశేషలక్షణములుగాఁ గన్పట్టుచున్నవి. పచ్చిశృంగారమును వర్ణించు తారాశశాంక విజయకర్తయగు శేషము వేంకటపతియు, రాధికాసాంత్వన కర్త్రియగు ముద్దుపళనియు నరవదేశపువారే. కొంచెమెచ్చుతక్కువగ నీ తరగతిలోఁ జేరిన చేమకూర వేంక

టకవియు నరవదేశస్థుఁడే. ఈతరగతిలోని వాఁడేయగు సాంబశివకవి యను నతఁడు బిల్హణీయముకూడఁ దెనుఁగున రచించి దక్షిణదేశపు శృంగారమునకొ [illegible] అంతవాపెను. బిల్హణీయమునకు బిల్హణీయములు, తారాశశాంక విజయమునకు దారాశశాంకవిజయములు, రాధికా సాంత్వనమునకు, రాధికాసాంత్వనములు రచించిన యీదాక్షిణాత్యాంధ్రకవుల శృంగారాభిరతి యేమని వర్ణింతును ? సముఖము వేంకటకృష్ణప్పనాయకుఁడొక రాధికాసాంత్వనము నేకాశ్వాసముగ రచించెను. విజయరంగ చొక్కభూపాలునిచే సువర్ణదండాదులుగొన్న బద్యపూడి యెట్ట్రభూపాలుఁడు తారాశశాంకకథ రచించి యువజన హృదయానందమని పేరిడెను. మఱియిద్దఱరవవారు తారాశశాంక కీర్తనలు, తారాశశాంకనాటకము (యక్షగానము) వ్రాసిరి. ఇవి గాక యరవలు రచించినవి మదనానందము, మీనకేతనాభ్యుదయము, శృంగార రసమంజరి యను పేరులుగల గ్రంథములుకూడ సంచయమున నున్నవి. వీని నన్నిటినిఁ జదివినచో నీతిపథ దూరుండైన భ్రష్టుండుం బోలె మద్యపానవ్యభిచారాదిదుష్కర్మ దూషితంబులగు సందుగొందులయందుఁ గవిత పతిత కావలసివచ్చెఁగదాయని పరితాపము కలుగక మానదు. అనంగరంగమను రతిశాస్త్రము సంస్కృతమునఁ గల్యాణమల్లవిరచిత మొకటి యున్నది గాని పూర్తిగ లేదు. అతిశృంగారమును వర్ణించిన దాక్షిణాత్యాంధ్రగ్రంథములే వ్యాకరణోల్లంఘనమును బ్రారంభించినవి. ఒకదేశభాష యన్యదేశమునందును నన్యదేశ ప్రాంతములందును వికృతమగుచుండును. ఈయవస్థ మన తెలుఁగునకింతకుఁ బూర్వము పట్టినది. ఇప్పుడు పట్టుచున్నది. స్వచ్ఛమైన భాష కేనాఁటికిని హాని వాటిల్లదు. కొందఱు హాని కలిగింపవలెనని యత్నించినను గలుగ నేరదు.

దాక్షిణాత్యాంధ్ర గ్రంథకర్తలలో "అళఘురి, పెరియన్న" యని యిద్దఱు కేవల మరవపేరులు గలవారే యున్నారు. సముఖము వేంకటకృష్ణప్పనాయక విరచితమైన యహల్యాసంక్రందన ప్రతియొకటి యున్నది; కాని సంపూర్ణము గాలేదు.

## శ త క ము లు.

ఇదివఱకిచ్చుటఁ బ్రచారములో నున్న దాశరథ్యాది శతకము లీసంచయమునఁ గలవు. అరవదేశస్థులు రచించిన శతకములు కూడ నున్నవి.

గీ॥ తాళనిచ్చునె ప్రేమ కాంతాలలామ" యనియంత్యపాదము గల కాం[illegible]లామ శతకము పచ్చి శృంగారముతో నిండియున్నది. ఇదియు నరవ [illegible]సి రచించినదియే. శృంగారపద్యము లని మఱియొక శతక మున్నది. రాను శతకము, ముక్తికాంత పద్యములు, సుబ్బరాయ శతకము, ప్రసన్న జన చింతామణి, సుబ్రహ్మణ్య శతకము, సిద్ధరామ శతకము, కాళహస్తి శృంగ శతకము, మీనాక్షీ శతకము ననునవియు నున్నవి.

## దండకములు, చూర్ణికలు.

సంచయమునందలి దండకములలో భోగినీదండకము తప్పఁ దక్కినవన్ని దక్షిణదేశమునందు జనించినవే యైయున్నవి. ఈ దండకములందును శృంగారము పొంగి పొరలుచున్నది. చంద్రాననా దండకము, లీలావతీదండకము, నామగిరి లక్ష్మీ దండకము, కామాక్షీ దండకము, [సూర్యదండకము], భోగినీదండకము, [శక్తిగణపతి దండకము], సుబ్రహ్మణ్య దండకము, వినాయక దండకము, ముద్దళగిరి దండకము ననునవి ముఖ్యము లైనవి. రాజులుంచుకొన్న భోగమువారినిఁ గూర్చిన దండకములు వీనిలో నున్నవి; భోగపుఁబడంతుల వాదములును నిందుఁ గలవు. భద్రాచలమువారి చూర్ణిక, గోపికాగీత చూర్ణిక, పాంచాలి రంగయ్యంగారి చూర్ణిక, రామస్వామి చూర్ణిక, యనునవి సంచయమునందున్న చూర్ణికలు.

## యక్షగానములు.

సంచయమునందలి యక్షగానములలో నొకటి రెండు తప్పఁ దక్కిన వన్నియు దక్షిణదేశమునం దుద్భవిల్లినవే యై యున్నవి. వీనిలోను శృంగారము మిక్కిలి యెక్కువగా నున్నది. గోపాల విలాసము, రంగపురిపారిజాత నాటకము, తారాశశాంక నాటకము, ననుపేరులను బట్టియే చదువరులు వానిలోని శృంగార రసమును గ్రహింపఁగలరు. దక్షిణదేశంబున నుద్భవిల్లిన యతిశృంగారరస ప్రవాహంబు నాలుగు పాయలై పద్యప్రబంధశతకదండకయక్షగానముల యందుఁ బాఱినదని చెప్పవచ్చును. సీతాకల్యాణము, ఎఱుకల కొఱవంజి

నాటకము, పార్వతీకల్యాణము, (మహోద్దండ వేంకన), సుందరకాండ గ[illegible] సుగ్రీవవిజయము నను యక్షగానములు కూడ సంచయమునం దున్న[illegible] ను

## ద్విపద ప్రబంధములు.

నలచరిత్రము (రాఘవకవి), సారంగధరచరిత్ర (బాణాలశంభుదాసుఁడు), ధర్మాంగదచరిత్ర (బొమ్మకంటి నృసింహకవి), రామాయణము (రంగనాథుఁడు), మైరావణచరిత్రము, భారతోద్యోగపర్వము (తిమ్మయ), గీతరఘునందనము (తిరుమలకవి), అనునవి సంచయమునందలి ముఖ్యద్విపదకావ్యములు. ఇవియన్ని దక్షిణదేశములోఁ బుట్టినవని చదువరులు భ్రమింపకుందురుగాక! బొమ్మకంటి నృసింహకవి యెవ్వరోకాని ద్విపదకావ్యములు విరివిగా వ్రాసియున్నాఁడు. ఈతఁడు రచించిన నలచరిత్రముయొక్క ముద్రితప్రతి నాయొద్దనున్నది. తిమ్మయ యుద్యోగపర్వమును జదువ నితఁడు భారతమంతయు ద్విపదకావ్యముగా రచించినట్లు కన్పట్టుచున్నది. గీతరఘునందనము గొప్పగ్రంథము. రంగనాథుని తరువాతనే ద్విపదకావ్యరచన ప్రబలినట్లు చెప్పుటకనేకాధారములు గలవు. మనలో ననేకులిప్పుడు ద్విపదకావ్యములన్నఁ జుల్కనగాఁ జూచుచున్నారు. ద్విపదకావ్యముల రచించుట సులభమనియు నందువలన నవి పండితజనాదరణీయములు కావనియు వారి యభిప్రాయము. కవితకుఁ గష్టమేమి సుఖమేమి? ఎముకలు విఱుచుకొని చెప్పిన పద్దెములలో నెక్కువరసముండునని కాఁబోలు వీరియభిప్రాయము. సాధారణ పద్యకావ్యములు రచించుటకంటె గణపవరపు వేంకటకవివలె బంధకవిత్వము చెప్పుట కష్టతరముగదా. అందువలనఁ బద్యకావ్యములకంటె బంధమయ కావ్యము లెక్కువగా నాదరింపఁదగినవని చెప్పవచ్చునా? గ్రంథము రచించుటకుఁగవి యెంతకష్టపడినాఁడని పరికించుట విమర్శకులపనిగాదు. "గ్రంథమున రసమెట్లుపోషించినాఁడు? ఎట్టిభావములున్నవి? భావానుకూలముగ శైలియున్నదా? భావముల నెట్లు వ్యక్తీకరించెను?" అని విచారింపవలసి యుండును. ఈ చర్చకిది స్థలముకాదు కావున నింతటితోఁ జాలింతును.

## వచన ప్రబంధములు.

సంచయమునందలి వచనకావ్యములు దాదాఁపుగ నన్ని దక్షిణదేశమునందే యుద్భవిల్లినవి. చదువరులెఱుంగఁ గోరుదురని వాని పేరులుక్రింద నుదాహరించుచున్నాను.

1. పంచతంత్రము.
2. భగవద్గీత.
3. మహావాక్యము.
4. గురుశిష్యసంవాదము.
5. ఆత్మైకబోధ.
6. భాగవతము.
7. విక్రమార్కచరిత్రము.
8. శ్రీరంగమాహాత్మ్యము (పాండ్యమండలాధీశ్వరుండైన విజయరంగ చొక్కనాథుఁడు.)
9. పాండవుల యశ్వమేధ వృత్తాంతము.
10. సాలభంజికల కథలు.
11. శ్రీరంగమాహాత్మ్యము.
12. జైమినిభారతము (సముఖ వేంకటకృష్ణప్ప నాయకుఁడు.)
13. ద్వాత్రింశత్సాలభంజికల కథలు.
14. రాయ వాచకము (విశ్వనాథరాయనిస్థానాపతి.)
15. రామాయణము (తుపాకుల అనంతభూపాలుఁడు.)
16. రామాయణము (శ్యామరాయకవి.)
17. గజారణ్యమాహాత్మ్యము.
18. రామాయణము.
19. రామాయణ సంగ్రహము.
20. భేతాళపంచవింశతి.
21. వచననైషధము.
22. పంచపదమహావాక్యము.
23. వాసుదేవమననము.
24. మాఘమాహాత్మ్యము (విజయరంగ చొక్కనాథుఁడు.)
25. వైశాఖమాహాత్మ్యము.

వీనిలోఁ గొన్నిటికి రెండేసిమూఁడేసి నాల్గేసి ప్రతులున్నవి. ఈగ్రంథనులలోఁ దుపాకుల యనంతభూపాల విరచితమైన విష్ణుపురాణము మాత్రము

ముద్రితమైయున్నది. ఆంధ్రభాషాజ్ఞానములేని యప్రౌఢులు గ్రామ్యముగా వ్రాసినగ్రంథములుకొన్ని వీనిలోనున్నవి. పైగ్రంథములన్నిటియందు దఱుచుగా వాక్యమధ్యవిసంధి కానవచ్చుచునేయున్నది. తుపాకులయనంతపాలునిరచన మనోహరముగను విన సొంపుగను నున్నది. కొలఁది వ్యాకరణదోషముల కేమిగాని తక్కినగ్రంథములలోని వచనముగూడ మిక్కిలి చక్కఁగ నున్నది. వీనియందలి వాక్యముల శయ్యయుఁ బదసంబంధమును నాంధ్రభాషాతత్త్వము ననుసరించి యున్నవి. ఇంగ్లీషుభాషాసంపర్కము లేని యాకాలమున నుదయించిన వచనకావ్యములు వాఙ్మయజిజ్ఞాసువుల కమూల్యములుగదా. చిన్నయసూరికిఁ బూర్వము వచనవాఙ్మయము విరివిగా లేదనియే యనేకులు భ్రమపడియుండిరి. గ్రంథములుదొరకనియప్పుడు భ్రమపడక యేమిచేయుదురు? ఇట్టి గ్రంథములను సంపాదించి వాఙ్మయవిమర్శకులకు వెలుంగునొసంగిన సాహిత్యపరిషత్తు ముందుముం దీదృశోపకారములు భాషకుసల్పవలయునని యాంధ్రులాసపడుట యుచితంబయగును. పూర్వోదాహృత గ్రంథపట్టికలోని రాయవాచకమును విశ్వనాథరాయలవారి "స్థానాపతి" రచించెను. ఈస్థానాపతి కృష్ణదేవరాయల సమీపముననుండి యాయనవృత్తాంతమును జూచినది చూచినట్లు వ్రాసెను. ఈగ్రంథము చరిత్రగా మిక్కిలియుపకరించును. ఇట్లు వ్రాయఁబడిన చరిత్రములు తెలుఁగునఁ బెక్కులు లేవు. ప్రత్యక్షముగాఁ జూచి వ్రాసిన చరిత్రాంశములయొక్క ప్రామాణ్యమునుగూర్చి నేనుజెప్పవలసినపనిలేదు. దీనిలో శూద్రగ్రామ్యము తఱుచుగాఁ బొడకట్టుచుండుటచే నీ "స్థానాపతి" శూద్రుఁడని తోఁచుచున్నది. ఆకాలపువచనశైలి తెలియుటకై సముఖము వేంకటకృష్ణప్ప నాయకుని జైమినిభారతమునుండి కొన్నిపట్టు లుదాహరించుచున్నాను:—

"అచ్చట మత్పుత్త్రిండైన మదనుని విషంబ్బు పెట్టించ్చి చంప్పించ్చెదనని యూహించ్చి తన తనయునిపేర స్వహస్తలిఖితంబ్బుగా నొక్కపత్రిక వ్రాసి ముద్రవైచి చంద్రహాసునిచేతికిచ్చి వినయంబ్బును నెనరుదోంచునట్లుగా చేరంబ్బిలిచి యీపత్రికంగ్గొని నీవొకండ్డను కుంతలపురంబ్బునకుంజని నాపుత్త్రునికీ కంమ్మి యిమ్ము యచ్చటనీకు సకలశోభనంబ్బులు గలుగుననిన చంద్రహాసుండ్డుపోయి ఆకంమ్మ గైకొని మనోమారుతవేగంబైన తురంగ్గంబ్బునెక్కి నిమిషమాత్రంబ్బున కుంతలపురంబ్బునకుంజని తత్పురప్రాంతంబ్బునంద్దు చంచ్చు చ్చంచ్చరీక ఝుంకార

సం[illegible]ంబైన యొక్కయుద్యానవన మధ్యంబ్బున హృద్యంబైన పద్మాకరంబ్బు
[illegible]ండగని రాయంచ్చజక్కవ పెంగ్గురుల గరుల గరువలిచే నెగయు పుప్పొడులనప్ప
[illegible]ంచ్చినవిప్పగునల్లకలువలు నుల్లసిల్లు తేనెసోనల నానిన చలిగాలిము(మొ?)లకల
వలన [illegible]శ్రమంబ్బుదీర తురంగ్గంబ్బు సాబానీవశంబ్బుచేసి పల్లవ పుష్పఫలభరితం
బైన సహకారవృక్షంబ్బునీడ బడలికెదీర పవ్వళించ్చి సిదురింప్పుచునుండ్డ ఆకుంతల
మహీకాంత్తుని కూతురు చంప్పకమాలిని దుష్టబుద్ధితనయ విషయయు మన్మథు
నారాధింప్పంగ్గోరి సఖీజనులతోడంగ్గూడ నవ్వనంబ్బునకువచ్చి పల్లవితంబ్బులుకు
సుమితంబ్బులు ఫలితంబ్బులునగు పొన్నలు పొగడలు గోరంట్టలు శామంత్తెలుచూ
తంబ్బులు పారిజాతంబ్బులు జాజులు విరిజాజులు మల్లెలు మొల్లలు పోకమాకులు
మొదలగు తరులతానికరంబ్బుల కుసుమంబ్బులు గోయుచువిరిగొత్తుల నొండ్డొరుల
మ్రోదుచు నొయ్యారంప్పునడలచే వనమయూరంబ్బుల గర్వంబ్బులుదింప్పుచు
పూలరెమ్మలు గూడివంప్పుచు పువ్వులకై మదిదింప్పుచు సఖులచేరంబ్బిలుచుచు
సరసంప్పుటెలుంగ్గులచే మత్తకోకిలంబ్బుల మదంబ్బులడంప్పుచు పువ్వుతీవియలు
వంప్పుచు మేనిమెఱుంగ్గుల వనంబ్బెల్లనింప్పుచు నిటలంబ్బులనటించ్చు కుటిలాల
కంబ్బులచే తుమ్మెదలంగ్గదుముచు పల్లవంబ్బులంచిదుముచు కోసినవిరులు పైయెద
లోనం దురుముచు తళుకువాలారుజూపుతూపులు బాలకురంగ్గ హృదయాంగ్దంబ్బు
లునాడుచు తేనియవాకలంద్దాటుచు తమసౌరభంబ్బులచే కుసుమసౌరభంబ్బులు
మాటుచు రాజనంద్దనయగు చంప్పకమాలియు మంత్రితనయయగు విషయయు
పువ్వులుగోసి యలసి కమలాకరంబ్బుడాసి వేడుకమీర జలక్రీడలాడి విగళితహార
మణి గణంబులచే కమలాకరంబ్బు రత్నాకరంబ్బు సేయుచు తత్తటంబ్బుల దువ్వ
టంద్దంబ్బులగట్టి సొమ్ములుబెట్టి కుంకుమకస్తూరికలలంద్ది యవ్వేలంద్దులు మన్మథ
పూజసేయుచుండ్డ నయ్యవసరంబ్బున నమ్మంత్రికొమారికె యక్కొలనిగట్టున
తీయమామిడిచెట్ల నీడలోనిదురింప్పుచునున్న చంద్రహాసునింగాంచ్చి అంద్దియలు
మొలనూలు మువ్వలు రవలమెట్టెలు మ్రోయకుండ మెల్లమెల్లనంజని యక్కు
మారవరుని రూపరేఖాసౌందర్యకళావిలాసంబ్బునకుంజొక్కి చక్కెరవిలుతుని
శారికింజిక్కిచేరంజని అడపసంచ్చితాటకట్టియున్న కంమ్మవిడిచిచూచి చెయివ్రాలు
దెలిసి యవ్వక్కణలాద్యంతమున్ను చదువుకొని నిజజనకునివిషమబుద్ధికి పరితా
పంబ్బు నొంద్దుచు రూపరేఖావిజిత రమాకుమారుండైన యీరాచకుమారునకు
విష మొసంగ్గుమని వ్రాసిననింతనిర్దయుండు జగంబ్బునంగ్గలండె యనివగచి విష

మొసంగ్గుమని వ్రాసినయక్షరంబ్బుల నడుమయకారంబ్బువ్రాసి తా...సింప్పక
నావచ్చునంత్తలో విషయ యొసంగ్గుమనివ్రాసి యప్పటిముద్రవైచి అడపసం...
తాటంగ్గట్టి పెన్నిధింజూచి విడువంజాలని పేదవడువున నవలనడుగిడంజాలక కొ...త
దడవుచూచుచుండ్డి పరాధీనగావున దీనమానసయై యెఱుంగ్గనియట్ల రాజపుత్త్రిక
డకుంజని తదనుమతిబడసి నిజగృహంబునకుంజనియె. అంత చంద్రహాసు... నిదు
రమేల్కొని సరసీజలంబ్బుల ప్రక్షాళితపాణిపాదవదనుండై తేజినె.....నప్పురంబ్బు
నకుంవచ్చి యచటనెడ శుభశకునంబ్బులు పొడగనుచు ప్రధానివాకిటికింజని ఘణి
హారిచేతనరాక మంత్రికుమారున (కెఱిం) గ్గించ్చుటయు నతండ్డు పుళిండ్దకుని సు
తుండ్డు వచ్చినాండనివిని సంభ్రిమంబ్బుగా నెదుర్కొని గాఢాలింగ్గనంబ్బుగావించ్చి
సంత్తసంబ్బున యేకాంత్తప్రదేశంబ్బునకుంజని పుళిండ్దునిసేమంబ్బడుగుచు తండ్రి
ముద్రవైచిన పత్త్రిక నొసంగ్గిన కేలంగ్గైకొని శ్రీమతుసకలగుణ సమృద్ధుండైన దుష్ట
బుద్ధియగు కుమారుండ్డగు మదనునిదీవించ్చి పుత్తెంచ్చిన శుభప్రయోజనంబ్బు.
పుళిండ్దునిముద్దుపట్టి కులస...నపౌరుషంబ్బుగల మేటి. యెల్లప్పుడు మనకు మహా
హితుండ్డు. వీనిం గనుంగ్గొనిన యాక్షణంబ్బున సందేహంబ్బుమాని విషయ నొసంగ్గి
నావచ్చునంత్తలో యల్లకార్యంబ్బులు చక్కబెట్టునది యను వక్కణచదువుకొని
సంతసించ్చి నాసహాయాదరికి తగినవరుండ్డు దొరికె మేలుమేలనుచు ము(మా)హూ
ర్త్తిక(కు)లు(ల)రావించ్చి యారాత్రి శుభలగ్నంబ్బు గలుగుటవలన వివాహంబ్బు
గావించ్చి మహేంద్రవైభవంబ్బున సముచితవిధానంబ్బు లాచరింప్పుచునుండ్డె."

దక్షిణదేశగ్రంథముల యందర్ధానుస్వార ముండవలసిన చోట శ్రద్ధతోనుం
పఁబడియున్నది. ఆకారమున మాత్ర మీయరసున్న పూర్ణానుస్వారమును బోలి
యున్నది. అంతటఁ బూర్ణానుస్వారమే పూర్వ ముపయోగించిరి కాని యర్ధాను
స్వారము లేదనుకొందమా పద్యపాదములందు గణభంగము సంభవించును. మన
దేశపుఁ దాళపత్త్రగ్రంథములలో నర్ధానుస్వారము కానరాదు. మనవారికంటె
దాక్షిణాత్యు లర్ధానుస్వారమును మిక్కిలి జాగరూకతతోఁ బాటించిరి. ద్రు
తమున కాదేశముగా వచ్చిన యరసున్నను వీరంత పాటించినవారు కారు.
సిద్ధానుస్వారములను (పదమధ్యమందలివి—అతఁడు, అరఁటి, నెలఁత, చెలఁగు)
విడిచిపెట్టక యుంచిరి. దీనికిఁ గారణ మారయఁగా దక్షిణదేశస్థులు "వాఁడు"
మొదలైన యరసున్నగల పదముల నుచ్చరించునప్పుడు సానునాసికోచ్చార
ణము చేయుదురని తెలియవచ్చుచున్నది. దక్షిణ మండలములందున్న తెలుఁగు

వారిప్పటికి వచ్చినాండు, పోయినాండు, పేండ (పేఁడ) చీంపురుకట్ట యని యనుస్వారము నత్యస్ఫుటముగ వినఁబడునట్లు మాటలాడుచుందురఁట. ఇందువలననే దాక్షిణాత్యగ్రంథములం దీయనుస్వార మెక్కువగాఁ బాటింపఁబడి యుండును. అరవ కన్నడ మళయాళభాషలందు ముక్కుసహాయముతోఁ బలుకవలసిన పదములు చాలు కలవు. మనదేశమునందుఁ గూడనీ యనుస్వారముచ్చారణములోనుండి క్రమక్రమమున జాఱిపోయియుండును. నే నుదాహరించిన జైమినీభారత పద్యములలోఁ జదువరులుకొన్ని విశేషములు కనిపెట్టవచ్చును. అనుస్వారము తరువాత వచ్చిన యక్షరము ద్విత్వమునుబొంది యున్నది. ఐకారము పరమైనప్పుడు ద్విత్వముకానరాదు. కొన్నిచోట్ల ద్రుతమునకు బదులుగావచ్చిన యనుస్వారమునకుఁబరముగానున్న యక్షరము ద్విత్వముం బొరసియుండలేదు; కొన్ని స్థలంబులం బొరసియున్నది. గట్టు, బడలిక వీనిలోని "అ" కారము "ఎ" కారమైనది. యడనెడ, యల్ల, యెల్ల అనుచోటుల యకారముమీది "అ, ఎ" అను నచ్చులొకటికొకటి మాఱినవి. "గుత్తి" "గొత్తి" గా మాఱినది. సముచ్చయమైన "ను" "న్ను" అని యొకచోనున్నది. ఇంకఁగొన్ని మార్పులునుగలవు. అనుస్వారము, అచ్చుల మాఱ్పులు, ద్విత్వము, మొదలగునవి స్వరశాస్త్ర (Phonetics) ప్రవిష్టులు గమనింపవలసిన విషయంబులుగదా.

అక్కిరాజు ఉమాకాంతం.